
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

శ్రీసత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025

నేడు పరిష్కార వేదిక



పుట్టపర్తి టౌన్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జిల్లా ప్రజలు సదినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

చిన్నారుల భవితకు బాటలు

- సమగ్రశిక్ష ద్వారా ఉచిత వైద్యం, పరికరాలు
- ప్రత్యేక అవసరాల పిల్లలకు వరం.. భవిత కేంద్రాలు
- ఏడు ఆటిజం స్కూళ్లు మంజూరు



సమగ్రశిక్ష మెడికల్ క్యాంపునకు వచ్చిన ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులు

7

ఏఎస్‌ఓగా రాలేను బాబోయ్..!

- విధుల్లో చేరని నరసింహారెడ్డి





7



నేడు కొత్త టీచర్లు జాయిన్ కావాలి

- రిలీవర్ వచ్చిన తర్వాతే బదిలీ టీచర్లు వెళ్లిపోవాలి
- డీఈఓ ప్రసాద్‌బాబు

7

అత్యవసర వేళ ఆక్రందనలు..!

- మూడు గంటలు నిరీక్షిస్తేనే అత్యసవర వైద్యం
- డాక్టర్ల కోసం రోగుల పడిగాపులు
- బాధ్యత మరచిన పెద్ద డాక్టర్లు
- పనిచేయని వైద్య పరికరాలు
- విరిగిపోయిన వీల్‌చైర్లు, దిష్టిబొమ్మల్లా లిఫ్టులు

జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల దుస్థితి



వైద్య కోసం స్ట్రెచర్లపైనే వృద్ధులు

అనంతపురం వైద్యం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అత్యవసర వేళ ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. అత్యవసర వైద్యమైనా.. ప్రాణాలు పోతున్నా... కనీసం మూడు గంటలు వేచి ఉంటేనే వైద్యం అన్న తరహాలో అక్కడ వైద్యసేవలు సాగుతున్నాయి. నానా కష్టాలుపడి ఓపీ చీటీ తీసుకున్నా.. పెద్ద డాక్టర్ల కోసం మరో గంట వేచి చూడాల్సిందే. అంతలోపు ప్రాణాలు గాల్లో దీపాల్లా (మిగతా 7లో..)

అక్కడికెళ్తే.. వేటే..!





మడకశిర సర్కిల్ కార్యాలయం

పోలీసులకు అచ్చిరాని మడకశిర

వరుసగా సీఐలు, ఎస్‌ఐలపై చర్యలు



సస్పెన్షన్, వీఆర్‌కు పంపుతుండడంతో అధికారుల్లో వణుకు

- రెండ్రోజుల క్రితం వీఆర్‌కు సీఐ నాగేష్‌బాబు
- 30 మంది హోంగార్డులపై బదిలీవేటు

మడకశిర టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఏ సర్కిల్‌కు, స్టేషన్‌కు వెళ్లినా పోలీసు అధికారులపై వేటు తప్పట్లేదు. సీఐలు, ఎస్‌ఐలపై వరుసగా సస్పెన్షన్, వీఆర్ వేటు పడుతుండడం గమనార్హం. మడకశిర సర్కి ల్ కార్యాలయానికి వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు చాలావరకు సస్పెన్షన్, వీఆర్‌కి వెళ్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమవడం, వివాదాలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల క్రితం మడకశిర అప్‌గ్రేడ్ సీఐ నాగేష్‌బాబును వీఆర్‌కి పంపారు. ఆయనపై అనేక అవినీతి, సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. స్థానిక ప్రజాప్రతినిధులు పలు మార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాకి కొత్తగా వచ్చిన ఎస్పీ సతీష్‌కుమార్ మూడు రోజుల క్రితం మడకశిర సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. అదేరోజే సీఐ నాగేష్ బాబును వీఆర్‌కి పంపడం పోలీసు వర్గాలు, ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మడకశిర సీఐగా ఉన్న రాగిరి రామయ్యను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. సీఐలు ఆరోహణరావు, దేవానంద్‌పై సైతం సస్పెన్షన్ వేటుపడింది. సీఐలు శుభకుమార్, దేవేంద్రకుమార్, సురేష్ బాబు, నాగరాజురావును వీఆర్‌కి పంపారు. గతంలో మడకశిర ఎస్‌ఐలుగా పనిచేసిన నాగేంద్ర, లోకేశ్ సైతం వీఆర్‌కి వెళ్లారు. అవినీతి ఆరోపణలు తదితర కారణాలతోనే చర్యలు తీసుకున్నట్లు పోలీసు శాఖ ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మడకశిర సర్కిల్‌కు రావాలంటే పోలీసు అధికారులు జంకుతున్నారు. సమర్థవంతమైన అధికారిని నియమిస్తే శాంతిభద్రతల పరిరక్షణతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందనీ, ఆ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

30మంది హోంగార్డుల బదిలీ

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల పరిధిలో పనిచేస్తున్న దాదాపు 30 మంది హోంగార్డులపై బదిలీ వేటు పడింది. పుట్టపర్తి, హిందూపురం, పరిగి తదితర స్టేషన్లకు బదిలీ చేశారు. ఎస్పీ వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులపై స్వయంగా ఆరాతీశారు. కొంత మంది హోంగార్డులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారుల అవినీతికి సహకరిస్తుండడంతోపాటు వసూళ్ల వ్యవహారాల్లో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా రెండ్రోజుల క్రితం 30 మంది హోంగార్డులను బదిలీ చేశారు. మరికొందరు పోలీసులపై కూడా బదిలీ వేటు తప్పదన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



వైసీపీ హయాంలో పురంపై నిర్లక్ష్యం

- కూటమి పాలనలో అభివృద్ధి వైపు తీసుకెళ్తాం
- అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



హిందూపురంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు మూడు రోజుల నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన రెండోరోజు ఆదివారం చిలమత్తూరు మండలంలో పర్యటించారు. తుమ్మలకుంట గ్రామంలో ఆయన స్వయంగా ఎఫ్‌పీ షాపుకెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. గ్రామీణ రోడ్లతో సహా పట్టణాభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. లింకు రోడ్లను అభివృద్ధి చేసి ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. త్వరలో ఈ ప్రాంతాన్ని మెగా పారిశ్రామిక వాడగా తీర్చిదిద్ది, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. హిందూపురం నుంచి గౌరీబిదనూరు, దొడ్డబళాపురం మీదుగా బెంగళూరుకు రోడ్డు మార్గాలను మెరుగుపర్చుతామన్నారు. వైద్య కళాశాలలపై ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండడంపై ఆయన స్పందించారు. ప్రభుత్వం.. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంలోనే పీపీపీ విధానాన్ని ఎంచుకుందన్నారు. ఇందులో ప్రైవేటుపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రతిపక్షాలు ఏ మాత్రం అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే హిందూపురంలో మున్సిపల్, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. తన కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నాయకులు బేకరీ గంగాధర్, శ్రీదేవి, నాగరాజు యాదవ్, రంగారెడ్డి, గౌరీశంకర్, బాలాజీ, అశ్వత్థప్ప పాల్గొన్నారు.

పుట్టపర్తిపై సాంకేతిక నిఘా

- 216 సీసీ కెమెరాల ఏర్పాటుకు భూమిపూజ
- రాష్ట్రంలోనే తొలిసారిగా నైట్‌విజన్ డ్రోన్ల వినియోగం



సీసీ కెమెరాల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే, మాజీ మంత్రి తదితరులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పోలీసు నిఘాను పటిష్ఠం చేసేందుకు సాంకేతికను వినియోగించనున్నారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోలీసుశాఖ అధునాతన సాంకేతిక భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ట్రస్టు సహకారంతో పట్టణంలో 216 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని గణేష్ కూడలిలో ఆదివారం రూ.1.39 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు భూమిపూజ నిర్వహించారు. శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గన్నారు. కార్యక్రమం అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు పట్టణం, చుట్టుపక్కల 10 కిలోమీటర్ల వరకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 10 ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు, 169 స్టాటిక్, 47 ఇతర కెమెరాలు కలిపి మొత్తం 216 ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కెమెరాలను కంట్రోల్ రూంతో అనుసంధానం చేసి 24 గంటలూ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా పుట్టపర్తిలో ఇంత విస్తృతస్థాయిలో సాంకేతిక నిఘా వ్యవస్థ అమలు చేస్తున్నామన్నారు. రూ.5 లక్షల వ్యయంతో రెండు నైట్‌విజన్ డ్రోన్లు శాంతిభద్రతల పరివేక్షణలో వినియోగించనున్నట్లు తెలిపారు. వీటిని రాష్ట్రంలోనే తొలిసారిగా వినియోగించనున్నామనీ, భద్రతారంగంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు చలం, చీఫ్ ఇంజనీర్ ప్రుష్టి, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, రామాంజినేయులు, గూడూరు ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, గంగాధర్ నాయుడు పాల్గొన్నారు.

గుంతలమయం... పెన్నానది బ్రిడ్జి

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు





పెన్నానది బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు, గుంతల్లో తేలిన ఇనుప కడ్డీలు

రొద్దం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమంతూరు పెన్నానది బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండ-మడకశిర రహదారిలోని పెద్దమంతూరు పెన్నానది బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అధిక సంఖ్యలో వాహనాలు కర్ణాటక రాష్ట్రానికి వెళ్తుంటాయి. గతేడాది మట్టితో గుంతలు పూడ్చినా ప్రస్తుతం లోతైన గుంతలు ఏర్పడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. దగ్గర దగ్గరగానే గుంతలు ఉండటంతో ఎలా వెళ్లాలో తోచక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నాయకుల పేకాట

- ధర్మవరంలో 9 మంది అరెస్టు
- రూ.1.77 లక్షల నగదు స్వాధీనం

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్‌లో బాలిరెడ్డి వైన్‌షాపు పక్కన ఓ బిల్డింగ్‌లో 9 మంది వైసీపీ నాయకులు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1.77 లక్షల నగదు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడులు చేశామన్నారు. 9 మందిని అరెస్టు చేసి, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారందరూ వైసీపీ నాయకులే కావడం గమనార్హం.

గ్రేడ్-1 కార్యదర్శులకు శుభవార్త

- డిప్యూటీ ఎంపీడీఓలుగా పలువురికి ఉద్యోగోన్నతి

7

మహిళా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

- ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

జగన్‌ది తెలివి తక్కువతనం

- అవగాహన లేకే వైద్య విద్యలో పీపీపీ విధానంపై విమర్శలు
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జగన్‌కు అవగాహన లేకే వైద్య విద్యలో పీపీపీ విధానంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. జగన్‌ది తెలివి తక్కువతనం అన్నారు. స్థానిక తన నివాసంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. జగన్ ఐదేళ్ల అధికారంలో ఉండి మెడికల్ కాలజీల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయాడన్నారు. ఆయన నిర్లక్ష్యంతో వైద్య విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. వారి కోసమే పీపీపీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తద్వారా మెడికల్ సీట్లు పెరుగుతాయన్నారు. మెడికల్ కాలేజీలు పూర్తిచేయలేకపోయిన జగన్.. రిషికొండలో తన కలల ప్యాలెస్‌ను మాత్రం యుద్ధప్రాతిపదికన కట్టుకున్నారని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం గురించిగానీ, మద్యపానం గురించిగానీ మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారను. అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పి.. మడమ తిప్పారని ధ్వజమెత్తారు. అధిక ధరలకు మద్యం అమ్మడమే కాకుండా, ఆ సొమ్మును దారి మళ్లించి, తన గల్లా పెట్టె నింపుకున్నారని ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్ అల్లా ముస్తఫా, టీడీపీ నాయకుడు గంగులప్ప పాల్గొన్నారు.

నన్నారి.. లాభాల దారి..



నన్నారి పంట

టెకీ వినూత్న సాగు

కళకళలాడుతున్న పైరు

ఆదాయం ఖాయం అంటూ ధీమా

ముదిగుబ్బ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నన్నారికి వేసవిలో అత్యధిక డిమాండ్ ఉంటుంది. అడవుల్లో పెరిగే అద్భుతమైన వనమూలిక ఇది. నన్నారి సాగులో సరైన పర్యవేక్షణ, ధర ఉంటే రూ.లక్షల్లో ఆదాయం పొందవచ్చని చెబుతున్నారు మండలంలోని హంస్సేన్‌పురం గ్రామానికి చెందిన రైతు చెన్నారెడ్డి సందీప్‌కుమార్ రెడ్డి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే పంటలు పెడుతున్నారు. బెంగళూరులో ఉద్యోగం చేస్తూనే.. వారాంతాల్లో స్వగ్రామానికి వచ్చి పంటలను చూసుకుంటున్నారు. ఇతర పంటల్లో ధరలు స్థిరంగా ఉండక తరచూ నష్టాలు వస్తుండడంతో ఈసారి నన్నారి పంట పెట్టారు. పంట కళకళలాడుతోంది. కోతలకు సిద్ధమవుతున్నారు. లాభాలు ఖాయమని ధీమాగా చెబుతున్నారు.

మదనపల్లి నుంచి మొక్కలు

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో నన్నారి సాగు చేసిన మిత్రుడి తోటను సందీప్‌కుమార్ రెడ్డి పరిశీలించి, సాగు విధానం, పరిరక్షణ గురించి తెలుసుకున్నారు. మొక్క రూ.3 చొప్పున 1.55 లక్షల మొక్కలు కొనుగోలు చేశారు. ఎకరాలో 12 వేల చొప్పున 13 ఎకరాల్లో ఈ ఏడాది నాటించారు. అంతకుముందు తమిళనాడు నుంచి రూ.1.68 లక్షలతో 4 లారీల ఎరువులు తెచ్చి, చల్లించి భూమిని దుక్కి చేయించారు. 20 మూటల డీఏపీ చల్లించి రోటావేటర్‌తో కలియదున్ని డ్రిప్పు పద్ధతిలో సాగు చేశారు. మొక్కలు నాటిన వారానికి ఆకులు రాలిపోయి కొత్త ఆకులు చిగురించాయి. అవసరాన్ని బట్టి వారం, పది రోజుల కోసారి నీరు పెడుతున్నట్లు రైతు చెబుతున్నారు. వర్షాకాలంలో తేమ తగ్గే వరకు నీరు పెట్టకుండా సరైన పర్యవేక్షణ ఉండడంతో మొక్క బాగా పెరిగింది. వేరు పురుగు తెగులు వ్యాపించడంతో గ్లైటెక్స్ పౌడర్ కిలో, క్లోరో లీటరు మందు కలిపి డ్రిప్పుల ద్వారా వదలడంతో అది నశించింది. మొక్క తీగ రెండు అడుగుల కంటే ఎత్తు పెరగకుండా నెలకోసారి కత్తిరిస్తుండడంతో దుంపల పరిమాణం బాగా పెరిగింది. సేద్యం, కూలీ, ఇతరత్రా ఖర్చులన్నీ కలిపి మొత్తం రూ.16.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రైతు చెబుతున్నారు.

ఏడాదిన్నరకు కోత

మొక్క నాటిన నాలుగు నెలల నుంచే దుంపలు పెరుగుతాయి. ఏడాదిన్నర నుంచి నాలుగేళ్ల వరకు ఎప్పుడైనా కోత కోయవచ్చు. ఒక మడక ద్వారా చెట్లను తొలగించి కూలీలతో పచ్చి దుంపలను వేరు చేసి ముక్కలు చేయాలి. 20 రోజులకుపైగా ఎండబెట్టాలి. 4 కిలోల పచ్చి దుంపలు ఎండబెడితే కిలో ఎండు దుంపలు వస్తాయి. ప్రస్తుతం పైరు పరిస్థితిని బట్టి చూస్తే 52 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.50 లక్షలు పలుకుతోందనీ, ఆ ధరతో విక్రయించినా రూ.50 లక్షలకుపైగా ఆదాయం వస్తుందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం నాలుగేళ్లు ఉండడంతో గడ్డ సైజు, ధరను బట్టి ఎప్పుడైనా విక్రయించవచ్చని చెబుతున్నారు. నన్నారి గడ్డలను జ్యూస్, టీ పొడి, సబ్బులు, సుగంధాల తయారీలో వినియోగిస్తారు. చెన్నైకి చెందిన హెర్బల్ ప్రొడక్ట్ కంపెనీ ప్రతినిధులు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తారని రైతు చెబుతున్నారు. త్వరలోనే కోతలు వేయనున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో లాభాలు

సరైన సస్యరక్షణ చర్యలు చేపడుతూ.. పంటను పరిరక్షించుకుంటే నన్నారి సాగు లాభదాయకం. ప్రస్తుతం పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చే అవకాశాలున్నాయి. నెలాఖరులో మరో ఏడెకరాల్లో నన్నారి సాగు చేసేందుకు భూమిని సిద్ధం చేస్తున్నా.



- సందీప్‌కుమార్ రెడ్డి, రైతు

మహిళా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

నేటి నుంచి రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న ఐద్వా అఖిల భారత కోశాధికారి పుణ్యవతి

అనంతపురం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల సమస్యలు పట్టడం లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ కోశాధికారి పుణ్యవతి విమర్శించారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు అనంతపురం వేదికగా సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు మూడురోజులపాటు జరగనున్నాయి. మహాసభల్లో పాల్గొనేందుకు పుణ్యవతితో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి రమాదేవి అనంతపురం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఐద్వా మహిళా హక్కుల గురించి పోరాడుతోందని గుర్తు చేశారు. మహిళల హక్కులకు భంగం కలుగుతున్న అనేక సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి, పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీల అమలుపైనా చర్చిస్తామన్నారు. మహాసభల్లో భాగంగా సోమవారం ఉదయం నగరంలో ర్యాలీ నిర్వహిస్తామని, లలితకళాపరిషత్‌లో సభ ఉంటుందని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి వెల్లడించారు. అనంతరం నగరంలోని ఎంకేఎం ఫంక్షన్‌హాల్‌లో మూడురోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమస్యలపై కవులు 150 కవితలు, 60 కథలు రాసి పంపారని, వాటన్నింటినీ పుస్తకంగా రూపొందించి మహాసభల్లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక, నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



శివకుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈత రాకపోయినా నీటిలో దిగిన ఓ విద్యార్థి గల్లంతై మృతి చెందాడు. బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం గ్రామ సమీపంలో హగరి నదిలో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన శివకుమార్ (16) నీటిలో మునిగి మృతి చెందాడు. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్‌ఓ కమల్ బాషా తెలిపిన మేరకు.. బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన బసమ్మ, రుద్రణ దంపతుల కుమారుడు శివకుమార్ గోవిందవాడ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మిత్రులు శివ, పూజారి శివ, తిప్పేష్, హర్ష, వన్నూరుస్వామితో కలిసి శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని హగరి నదిలో ఉన్న నీటి కుంటలో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో రెండుసార్లు స్నేహితులు అతడిని బయటకు తీశారు. అయినా మూడోసారి నీటిలోకి దిగడంతో గల్లంతయ్యాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన స్నేహితులు భయంతో ఎవరికి చెప్పలేదు. రాత్రయినా శివకుమార్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి గ్రామంలో విచారించి స్నేహితులను గట్టిగా ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే కుంట వద్ద గజ ఈతగాళ్ల సహాయంతో శవాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

గుంతకల్లుటౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని చెన్నప్ప కొట్టాల రిజర్వాయర్ సమీపంలో శివకుమార్(35) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలం నంచర్లకు చెందిన శివకుమార్ గుంతకల్లు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చాంద్‌బాష అనే ఉల్లిగడ్డల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రిజర్వాయర్ వద్ద అదుపు తప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి 11 సంవత్సరాల క్రితం వివాహమయిందని, అతడి భార్య విడాకులు తీసుకుందని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

రూ.18 లక్షలు తీసుకుని మోసగించారని ఆవేదన

డీఎస్పీ కార్యాలయం వద్ద పెట్రోలుతో యువజంట ఆత్మహత్యాయత్నం



డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దంపతులు

అనంతపురం క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ ఓ యువ జంట అనంతపురంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేసింది. సమాచారం అందుకున్న అనంతపురం టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కళ్యాణదుర్గం మండలం కుర్లోపల్లికి చెందిన అశోక్ (33), ఆయన భార్య అశ్విని(31) అనంతపురం అర్బన్ డీఎస్పీ కార్యాలయం వద్ద నేలపై పడుకుని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడతూ... ఐపార్సుపల్లికి చెందిన రామకృష్ణస్వామి అనే వ్యక్తి భరోసా ఇవ్వడంతో తన మామ ఆంజనేయులుకు రూ.18 లక్షలు డబ్బులు ఇచ్చానని తెలిపారు. మూడేళ్ల కిందట డబ్బులు ఇచ్చానని, ఏడాది కిందట తన మామ మరణించాడని వివరించారు. తనకు హామీ ఇచ్చిన రామకృష్ణస్వామి కానీ, తన అత్త కానీ ఇప్పుడు డబ్బులు అడిగితే....పట్టించుకోలేదన్నారు. రూ.5 వడ్డీకి తెచ్చి డబ్బులు ఇచ్చానని, ఇప్పుడు తనకు సంబంధం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారని వాపోయారు. రామకృష్ణస్వామి, అంజి, సుదర్శన్, కిష్టప్ప మరికొందరి వల్ల తనకు న్యాయం జరగడం లేదని అన్నారు. తన అత్త కొందరు కానిస్టేబుళ్లు, సీఐకి చెప్పి....తనను బెదిరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరగకుంటే చచ్చిపోతానంటూ ఆందోళనకు దిగాడు. పోలీసులు వారించినా వినకుండా తమకు న్యాయం జరగడం లేదంటూ అశోక్, ఆయన భార్య గగ్గోలు పెట్టారు. పోలీస్టేషన్‌కు వెళదాం... న్యాయం చేస్తామని టూటౌన్ పోలీసులు చెబుతున్నా వినకుండా ఆందోళన చేశారు. తర్వాత డీఎస్పీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయం గేటు వరకూ వెళ్లి.. ఆత్మహత్య చేసుకుంటాం అంటూ పెట్రోల్ బాటిల్ తీసుకోగా...పోలీసులు వారి నుంచి లాక్కున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీస్టేషన్‌కు తరలించారు.

గుంతకల్లు మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే పనుల కారణంగా వరంగల్లు-విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్లను గుంతకల్లు-ధర్మవరం సెక్షన్ గుండా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. దానాపూర్-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 03251) రైలును ఈనెల 13వ తేదీన, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 03252)ను ఈనెల 15న బాలార్షా, ఖాజీపేట, సికింద్రాబాద్, సూళేహళ్లి వెస్ట్, గుంతకల్లు, ధర్మవరం మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలియజేశారు. దానాపూర్-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 03259) రైలును ఈ నెల 14న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 03260) రైలును ఈనెల 16న ఇదే రూటులో మళ్లించి పంపనున్నట్లు వివరించారు.



● ఈ ఫొటోలో ఉన్న చిన్నారి పేరు హర్షిత. గుత్తి మండలం తొండపాడు. నరాల బలహీనత వల్ల నిలబడలేదు. ఆ కుటుంబం అనేక ఇబ్బందులు పడుతోంది. ఇపుడు భవిత కేంద్రంలో అవసరమైన వైద్యసేవలు (ఫిజియోథెరపీ) పొందుతున్నారు. ప్రభుత్వం ఓ ట్రై సైకిల్ ఇచ్చింది. అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోందని బాలిక తల్లి కుళ్లాయమ్మ తెలిపారు.



● ఈ అబ్బాయి పేరు ఈశ్వర్. గుత్తి ఆర్ఎస్‌లో నివాసం ఉంటున్నారు. బుద్ధి మాంద్యుడు. అబ్బాయిని మామూలు మనిషిగా మార్చడానికి ఎంతో ప్రయత్నించామని తండ్రి కృష్ణ అన్నారు. ఆర్థికంగా చితికిపోయినా ఫలితం దక్కలేదు. ఇపుడు సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి అబ్బాయిని తీసుకెళుతున్నారు. అక్కడ ఐఈఆర్టీ ఆధ్వర్యంలో మార్పునకు అవసరమైన ఆటలు ఆడిస్తున్నారు. దీంతో గతంకన్నా కనీసం గుర్తుపడతాడని, చెబితే వింటాడని కృష్ణ తెలిపారు.



● సాయిదీక్షిత్ ఆచారి అనే ఈ అబ్బాయి బుద్ధిమాంద్యతతో పాటు కనీసం కూర్చోవడానికి కూడా ఇబ్బందిపడేవాడని తల్లి రాజేశ్వరి తెలిపారు. అనంతపురంలోని భవిత కేంద్రానికి రెండేళ్లుగా రోజూ తీసుకెళుతున్నామని వివరించారు. ఇపుడు నడవగలుగుతున్నాడని తల్లి ఆనందం వ్యక్తం చేసింది.

చిన్నారుల భవితకు బాటలు

సమగ్రశిక్ష ద్వారా ఉచిత వైద్యం, పరికరాలు

ప్రత్యేక అవసరాల పిల్లలకు వరం.. భవిత కేంద్రాలు

ఏడు ఆటిజం స్కూళ్లు మంజూరు

అనంతపురం విద్య, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వరంగా మారాయి. జిల్లాలో వేల సంఖ్యలో వీటి ద్వారా ఉపశమనం పొందుతున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ ఓ భవిత కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 4,186 మంది వివిధ జబ్బులతో బాధపడుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సేవలు పొందుతున్నారు. ఈ పిల్లలకు సేవలు అందించడంకోసం 61 మంది ఐఈఆర్టీలు, 31 మంది ఆయాలు, 8 మంది ఫిజియోథెరపిస్టులు పనిచేస్తున్నారు. వీరు భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలకు అవసరమైన పరికరాలతో సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా 21 రకాల వైకల్యాలతో బాధపడుతున్న 18 ఏళ్లలోపు పిల్లలకు చికిత్సలు అందిస్తున్నారు. ఇందులో పూర్తీ అంధత్వం, బహుళవైకల్యం, వినికిడి లోపం, కండరాల బలహీనత, నాడీ వ్యవస్థ లోపం, రక్తహీనత, మరుగుజ్జుతనం, మాట్లాడడంలో లోపం తదితర వాటితో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన సేవలు అందిస్తూ సాధారణస్థితికి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నారు.

ఉచితంగా పరికరాలు, సేవలు

భవిత కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా వైద్యసేవలు అందిచడంతో పాటు అవసరమైన పరికరాలు(ఉపకరణాలు) అందిస్తున్నారు. పిల్లలను కేంద్రాలకు తీసుకురావడానికి అవసరమైన ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. రవాణా ఖర్చుగా వారితో పాటు వెంటవచ్చే సహాయకుడికి ఒక్కొక్కరికి దూరాన్ని బట్టి నెలకు రూ.600 నుంచి రూ.1000 వరకు పదినెలలు పాటు చెల్లిస్తున్నారు. జిల్లాలో దాదాపు రూ. 5 కోట్ల వరకు అలవెన్స్‌లకు ప్రభుత్వం ఖర్చుపెడుతోంది. వైద్యసేవలు, పరికరాల కొనుగోలు, మెడికల్ క్యాంపులు నిర్వహణకు భారీగానే ఖర్చు చేస్తోంది.

ఆటిజం పిల్లల కోసం..

ఒంటరిగా ఉండడం, ప్రవర్తన నిలకడగా ఉండకపోవడం, ఒకేరకమైన పనిని లేదా వాతావరనాన్ని ఇష్టపడడం, వస్తువులను నైపుణ్యంతో తిప్పడం, తిరిగే వస్తువులను తదేకంగా చూడడం, ఏ విషయంలోనైనా మార్పును భరించలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే ఆటిజం వ్యాధిగా వైద్యులు నిర్ధారిస్తారు. ఇటీవల కాలంలో ఆటిజం బాధిత పిల్లల సంఖ్య పెరగడంతో వారికోసం ప్రత్యేకంగా స్కూళ్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోను ఆటిజం స్కూళ్ల ఏర్పాటుకు విద్యాశాఖ మంత్రి ప్రత్యేక కృషి చేశారు. అందులో అనంత జిల్లాకు ఏడు ఆటిజం పాఠశాలలను మంజూరు చేశారు. ఈ పాఠశాలల ఏర్పాటుకు సమగ్రశిక్ష యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

త్వరలో ఏర్పాటు



ఆటిజం బాలుడిని పలకరిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి

జిల్లాలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం భవిత కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నాం. ఇప్పటికే ఈ కేంద్రాలలో దాదాపు ఐదు వేల మంది వరకు సేవలు పొందుతున్నారు. ఉచిత చికిత్స, పరికరాలు, రవాణా ఖర్చులు అందిస్తున్నాం. ఇంకా అలాంటి పిల్లలందరిను గుర్తించి సేవలు అందించడం కోసం ప్రతి నియోజకవర్గంలోనూ క్యాంపులు నిర్వహిస్తున్నాం. జిల్లాకు ఏడు ప్రత్యేక ఆటిజం స్కూళ్లు మంజూరయ్యాయి. అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాలలోని పీఎంశ్రీ స్కూళ్లలోనే ఆటిజం పాఠశాలల ఏర్పాటుకు ఆలోచిస్తున్నాం. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

-శైలజ, సమగ్రశిక్ష, ఏపీసీ



ఎమర్జెన్సీలో కిక్కిరిసిన రోగులు



ఎమర్జెన్సీ డాక్టర్ గదికి తాళాలు

అత్యవసర వేళ ఆక్రందనలు..!

(5వ పేజీ తరువాయి)

మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పెద్దాసుపత్రిలో నిత్యం ఇదే తంతు. ప్రాణాలు కాపాడుదామన్న కనీస బాధ్యత ఏ ఒక్క వైద్యుడిలోనూ కనిపించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆదివారం ఆసుపత్రి ఆవరణంలో పలువురు రోగులు పడిన ఇబ్బందులు ఇందుకు నిదర్శనగా నిలుస్తున్నాయి. ఉదయం 9 గంటలకే జిల్లా నలుమూలల నుంచి రోగులు బారులు తీరారు. ఓపీ చీటీల కోసం నానా అవస్థలు పడ్డారు. మరికొందరు అత్యవసర పరిస్థితుల్లో వైద్యుల కోసం గంటల తరబడి వేచిచూసి నిట్టూర్చారు. ఓ వైపు మండుటెండ.. మరోవైపు ఆసుపత్రిలోని సమస్యలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వీల్‌ఛైర్ అందించే నాథుడే లేడు. ఉన్న వీల్‌ఛైర్లు కూడా పని చేయడం లేదు. చేసేది లేక విరిగిన ఆ వీల్‌ఛైర్లలోనే రోగులను బంధువులు తీసుకెళ్లాల్సిన దుస్థితి కనిపించింది. ఒకటి, రెండు ఫ్లోర్‌లకు వెళ్లాల్సిన రోగుల పరిస్థితి మరీ దారుణం. ఉన్న లిఫ్ట్ దిష్టిబొమ్మలా మారిపోయింది. బీపీ, షుగర్, గుండె సంబంధిత ఈసీజీ యంత్రాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాత వాటితోనే పరీక్షలు చేశారు. ఫలితం సరిగ్గా కనబడకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. ఇలా ఆదివారం పలువురు రోగులు పెద్దాసుపత్రిలో వైద్యం అందక నరకయాతన అనుభవించారు. గందరగోళ పరిస్థితుల నడుమ పలువురు రోగులు సొమ్మసొల్లిపడిపోయారు. అయ్యా పెద్ద డాక్టర్ ఎప్పుడొస్తారు.. మాకు ఎప్పుడు వైద్యం చేస్తారు... మాకేంటి సామీ ఈ కష్టాలంటూ రోగుల ఆక్రందనలు మిన్నంటాయి.

పొద్దున వస్తే.. సాయంత్రమైంది...



మా అత్త మాబున్నీసాకు షుగర్, బీపీ, ఆయాసం ఉండటంతో పెద్దాసుపత్రికి ఉదయం 9 గంటలకు తీసుకొచ్చాను. ఓపీ చీటీ కోసం గంట.. డాక్టర్ వచ్చి చూసేందుకు రెండు గంటలు, ఈసీజీ చేయించడానికి గంట తిప్పారు. మధ్యాహ్నం స్కానింగ్‌కు రాసిచ్చారు. ఈ పనులన్నీ చేయడానికే సమయం అయిపోయింది. మధ్యాహ్నం అన్నం కూడా తినలేదు. దీంతో మా అత్త ఆయాసంతో మరింత ఇబ్బంది పడింది. స్కానింగ్ అయిన తరువాత డాక్టర్ దగ్గరకెళ్తే వార్డుకు మార్చారు. పొద్దున వస్తే.. సాయంత్రం 5 గంటలకు వార్డుకు పంపారు.

-దౌలా, అనంతపురం

చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. వాటిని పరిష్కరించేందుకు వైద్యులు, అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. పనిచేయని యంత్రాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేస్తాం.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

భర్త ఇంటి ముందు నిరసన

ఇంట్లోకి రానివ్వని కుటుంబ సభ్యులు

మాట వినకుంటే కేసు నమోదు: ఎస్ఐ



భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్న మౌనిక

సోమందేపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నీవు లేకుండా బతకలేనన్నాడు.. నూరేళ్ల నీతోనే ఉంటా అన్నాడు.. ప్రేమ పేరుతో యువతిని వంచించాడు. పెద్దలు ఒప్పుకోలేదని తప్పుకోబోయాడు. పోలీసులు, పెద్దల సమక్షంలో యువతితో ప్రేమ వివాహం జరిపించారు. ఆ తరువాత ఆమెను పుట్టింట్లో వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఆమె 9 నెలల గర్భవతి అని బంధువులు తెలిపారు. మంచి రోజులు లేవంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. చివరకు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. చివరికి భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలంటూ ప్రాధేయపడుతోంది. మండలంలోని పందిపర్తి గ్రామానికి చెందిన హరి, అదే గ్రామానికి చెందిన మౌనికను ప్రేమ వివాహం చేసుకుని వదిలేశాడు. గర్భవతిని చేసినా తనకెలాంటి సంబంధం లేదని చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం పోలీసులు భర్త, తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ప్రయోజనం లేకపోడంతో ఆదివారం మౌనిక భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. భర్త తల్లి సంపతక్క, తండ్రి ఆంజనేయులు, అన్న నగేష్, వదిన ప్రమీళ తన జీవితంతో ఆడుకుంటున్నారని వాపోయింది. తాను ప్రస్తుతం గర్భవతినని తెలిసినా, కనికరం చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యం అంటూ కన్నీటి పర్యంతమయింది. దీనిపై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. గతంలో కౌన్సెలింగ్ ఇచ్చి పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం జరిపించామని తెలిపారు. ప్రస్తుతం భర్త తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామని వివరించారు. వారి వైఖరి మార్చుకోకపోతే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు కొత్త టీచర్లు జాయిన్ కావాలి: డీఈఓ

అనంతపురం విద్య, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ప్లేస్‌మెంట్ ఆర్డర్లు పొందిన కొత్త టీచర్లు సోమవారం కేటాయించిన పాఠశాలల్లో జాయిన్‌కావాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. వారు విధుల్లో చేరిన తర్వాత బదిలీ అయినా రిలీవర్స్ లేక పాత పాఠశాలలోనే పనిచేస్తున్న వారు రిలీవ్ కావాలన్నారు. జాయిన్ అయ్యే కొత్తటీచర్ల సంఖ్య మేరకే రిలీవ్ కావాల్సి ఉంటుందన్నారు. ఈ విషయం సంబంధితమండల విద్యాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు తెలుసుకుని, ఆ మేరకే జాయినింగ్, రిలీవ్ చేయాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు.

9 మంది కూలీలకు అస్వస్థత

గుంతకల్లుటౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో మొక్కజొన్న పొలంలో గుళికల మందు చల్లుతూ తొమ్మిది మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన సుబ్బరాయుడు ఐదు సంవత్సరాల నుంచి వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వివిధ పంటలను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం 20 ఎకరాలలో మొక్క జొన్న సాగుచేశాడు. పట్టణంలోని మహబూబ్ నగర్ కాలనీకి చెందిన 19 మంది కూలీలు ఆదివారం మొక్కజొన్న పంటలో పనిచేసేందుకు వెళ్లారు. ఉదయం భోజనం చేసిన తరువాత కూలీలు మొక్కజొన్న పంటలో పురుగు నివారణకు గుళికల మందు చల్లారు. మందు చల్లిన కొద్దిసేపటికి రామాంజినమ్మ, అశ్వని, శారదమ్మ, చంద్రకళ, సుశీల, లక్ష్మీ, వహిదాబేగం, మహాలక్ష్మి, నాగేంద్రమ్మ అనే కూలీలు వాంతులు చేసుకుని కళ్లు తిరిగి కిందపడిపోయారు. గమనించిన తోటి కూలీలు వీరిని ఆటోలో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉందని, 24 గంటలు పరిశీలనలో ఉంచాలని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఏఎస్ఓగా రాలేను బాబోయ్..!

- విధుల్లో చేరని నరసింహారెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షకు రాను బాబోయ్ అంటూ నరసింహారెడ్డి మారాం చేస్తున్నారట. దాదాపు ఏడాదిగా వివాదాల మధ్య వాయిదాలు పడుతూ రాగా, రెండువారాల క్రితం సమగ్రశిక్ష సెక్టోరల్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం ఆరు పోస్టులకు గాను ఐఈడీ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థి లేకపోవడంతో ఆగిపోయింది. మిగిలిన ఐదు పోస్టులకు ఎంపికైన టీచర్లను వెల్లడించారు. అందులో నలుగురు సెక్టోరల్స్ ఆర్డర్లు ఇచ్చిన తక్షణమే జాయిన్ అయ్యారు. ఆ శాఖలో అత్యంత కీలకమైన ఏఎస్ఓ (అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్) పోస్టుకు బొమ్మనహాల్ మండలంలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్ నరసింహారెడ్డి ఎంపికయ్యారు. ఆయన మాత్రం ఇంత వరకు జాయిన్ కాలేదు. అధికారులు, తోటి మిత్రులు అడిగితే తాను జాయిన్ కాను బాబోయ్ అని చెబుతున్నారట. కారణాలు పలు రకాలుగా వినిపిస్తున్నాయి. ఈ పోస్టుకు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం. ఈయనకు కంప్యూటర్ పరిజ్ఞానం పెద్దగా లేదని, అందుకే జాయిన్ కావడానికి జంకుతున్నాడని చర్చించుకుంటున్నారు. కుటుంబంలో ఒకరికి ఆరోగ్య సమస్య ఉండడంతో జాయిన్ కాలేదని మరికొందరు చెబుతున్నారు. ఇవన్నీ ఆయనకు ముందుగానే తెలుసు. అలాంటపుడు ఎందుకు దరఖాస్తు చేసుకున్నాడని ఇతర టీచర్ల మండిపడుతున్నారు.

గ్రేడ్-1 కార్యదర్శులకు శుభవార్త

డిప్యూటీ ఎంపీడీఓలుగా పలువురికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గ్రేడ్-1 కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎట్టకేలకు వారికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు గ్రేడ్-1 కార్యదర్శులతోపాటు వీడీఓ(విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కేటగిరి కింద ఇద్దరికి, డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి మరో సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శనివారం రాత్రి పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన జిల్లా
అశోక్ కుమార్	ఆకుతోటపల్లి	అనంతపురం
గోపాల్	పామిడి	అనంతపురం
రమణ	బొమ్మనహాల్	అనంతపురం
చంద్రశేఖర్	సీకే పల్లి	అనంతపురం
శ్రీనివాసరెడ్డి	కొత్తచెరువు	శ్రీసత్యసాయి
ప్రవీణ్‌కుమార్	నారాయణపురం	శ్రీసత్యసాయి
ముత్యాలరెడ్డి	గార్లదిన్నె	శ్రీసత్యసాయి
ప్రేమ్‌కుమార్	రాప్తాడు	శ్రీసత్యసాయి
అబ్దుల్ మునాఫ్	కాళసముద్రం	శ్రీసత్యసాయి
సాదిక్ అలీ	బుక్కపట్నం	శ్రీసత్యసాయి
సుధాకర్ కుమార్	అమరాపురం	శ్రీసత్యసాయి
బాబురావు	రొళ్ల	శ్రీసత్యసాయి
వెంకటేశ్వరప్రసాద్	కణేకల్లు	శ్రీసత్యసాయి
మనోహర్	డీపీఓ కార్యాలయం	శ్రీసత్యసాయి
ఎంఎల్ఎన్ ప్రసాద్	గుత్తి	అన్నమయ్య
ఎర్రిస్వామి	పాల్తూరు	శ్రీసత్యసాయి

ఉద్యోగోన్నతి పొందిన వారికి ఆ జిల్లాలో మండలాలు కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీలు ఇలా ఉన్నాయి.. అనంతపురం జిల్లాలో తాడిపత్రి, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, రాప్తాడు స్థానాలు ఖాళీలుగా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో రామగిరి, రొద్దం, మడకశిర, రొళ్ల, అమరాపురం, పెనుకొండ, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, కొత్తచెరువు, నల్లచెరువు, కదిరి, తలుపులకు సంబంధించి ప్రస్తుతం ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓలతోనే కాలం నెట్టుకొస్తున్నారు. వీటిలో నూతనంగా బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా పనిచేస్తున్న మాధవికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. పెనుకొండ డిప్యూటీ ఎంపీడీఓ కమలాబాయి, నల్లచెరువు డిప్యూటీ ఎంపీడీఓ శకుంతల, రాప్తాడు డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్‌కు ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఖాళీ అయ్యాయి. దీంతో ఆ స్థానాల్లో సైతం నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన వారితో భర్తీ చేయనున్నారు.

చందనలో చోరీ

- 3.5 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.8వేలు నగదు అపహరణ

యాడికి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన గ్రామంలో దొంగలు చెలరేగిపోయారు. తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి 3.5 తులాల బంగారు నగలు, 10 తులాల వెండి, రూ.8 వేల నగదు చోరీ చేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. చందన గ్రామానికి చెందిన కంబగౌని ఆనంద్ అనే వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. రెండురోజుల క్రితం విధులకు వెళ్లాడు. ఆయన భార్య, కుమారుడు ఇంటికి తాళంవేసి వేరే గ్రామానికి వెళ్లారు. శనివారం రాత్రి విధులు ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన ఆనంద్ తాళం తెరచి ఉండడం గమనించాడు. ఇంటి లోపల బీరువా తెరచి ఉండడం, అందులో బంగారు, వెండి, నగదు లేకపోవడంతో భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆమె ఇంటికి వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంటికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

యాదవవీధిలో పారిశుధ్య చర్యలు

ధర్మవరం, అక్టోబరు 12((ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డు యాదవవీధిలో చెరువు కట్ట వద్ద టీడీపీ నాయకులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతం చెత్తాచెదారంతో నిండిపోయింది. దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్, వార్డు ఇన్‌చార్జ్ అడ్డ మహేశ్ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామ్ ఆదేశాల మేరకు టీడీ పీ నాయకులు అడ్డ మహేశ్ తదితరులు ఒక ఎక్స్‌కవేటర్, మూ డు టిప్పర్ల సాయంతో ఆ ప్రాంతంలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. సమస్య పరిష్కరించడంతో స్థానికులు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆస్పత్రి రోడ్డులో ఎల్‌ఈడీ వెలుగులు


పీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు

ధర్మవరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రహదారిలో ఎల్‌ఈడీ బల్బులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. చీకటిపడగానే ఆసుపత్రి వద్దకు వెళ్లాలంటే భయపడుతున్నారని టీడీపీ ఆ గ్రామ నాయకుడు జంగం నరసిం హులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు పంచాయితీ సిబ్బంది టీడీపీ నాయకులు కలిసి విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు వేయించారు. గ్రామస్థులు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంజారా సంఘం జిల్లా కోశాధికారిగా రవీంద్రనాయక్



గాండ్లపెంట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బంజారా సంఘం జిల్లా కోశాధికారిగా రవీంద్ర నాయక్‌ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం మండల నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. గాండ్లపెంట మండలం తుమ్మలబైలు పెద్దతండా పంచాయతీ సర్పంచ్ రవీంద్రనాయక్‌ను నియమించినందుకు వారు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు. బంజారాల అభివృద్ధి కోసం తన వంతు కృషిచేస్తానని, వారి సమస్యల సాధన కోసం పోరాడతానని రవీంద్రనాయక్ తెలిపారు.

కూటమిని మరింత బలోపేతం చేద్దాం

● బీజేపీ నాయకుడు పోతుల సురేష్

కొత్తచెరువు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా కూటమిని మరింత బలోపేతం చేద్దామని బీజేపీ నాయకుడు పోతుల సురేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పుట్టపర్తి మార్కెట్‌యార్డు చైర్మన్ పూల శివప్రసాద్ ఆయనను శనివారం రాత్రి స్వగృహానికి ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా పోతుల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలనపోయి త్రిమూర్తుల పాలన వచ్చిందన్నారు. జగన్ పాలనలో ఆ పార్టీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడానికే ప్రాధాన్యమిచ్చారని, రాష్ట్రం అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభివృద్ధి బాటలో నడుపుతున్నారని ఆయన అన్నారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్‌ను పోతుల సురేష్ సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, చికెన్ సెంటర్ వెంకటేష్, బీఎస్ఎన్ఎల్ వెంకటేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


హెచ్‌ఎంకు ల్యాప్‌టాప్, ప్రింటర్ అందజేస్తున్న రమేష్ నాయక్

తనకల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 27 సంవత్సరాల తరువాత ఆదివారం కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణంలో ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థి రమేష్ పాఠశాలకు తనవంతుసాయంగా ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను అందజేశారు. తాము కూడా భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని మిగితా వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సందీప్‌కుమార్, రమేష్‌నాయక్, కడపల శ్రీకాంత్‌రెడ్డి, వెంకి, రాజేష్, శివ, అనురాధ, నిరూపమ, సహజ, కృష్ణవేణి, సృజన పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు

మరమ్మతులు చేయాలంటున్న వాహనదారులు


పుట్టపర్తి రహదారిలో తుంపర్తి కాలనీ వద్ద రోడ్డుపై పడిన గుంతలు

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుట్టపర్తికి వెళ్లే రహదారిలో తుంపర్తికాలనీ వద్ద రోడ్డుపై పడిన గుంతలతో వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మోటుమర్ల వద్ద నుంచి తుంపర్తి కాలనీ వరకు ఈ రోడ్డు గుంతలుపడి అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుపై మోకాళ్ల లోతు గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడేవారు. రాత్రి సమయాల్లో ఆ గుంతలను గమనించక పలువురు వాహనదారులు కిందకు పడి తీవ్రంగా గాయపడిన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభు త్వం వచ్చాక రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేశారు. ఇటీవల రోడ్డుపై కంకర తేలి మళ్లీ గుంతల మయంగా మా రింది. వాహనదారులకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. వర్షాకాలంలో రోడ్డుపై పడిన గుంతలలో నీరు చేరడంతో ఆ గుంతల్లో నీరు ఉందన్న విషయం తెలియక ముందుకు వెళ్లడంతో వాహనాలు అదుపుతప్పి చాలామంది కిందకు పడి గాయాలపాలయ్యారు. ఈ రెండు వెంటే నిత్యం ప్రజాప్రతినిధులు, వీఐపీలు జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. వారికి ఈ గుంతల మయమైన రోడ్డు ఒక్కసారైనా కనిపించలేదా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతల మయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

● యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

కదిరి అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన ఆదివారం రెండో జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలుచేయాలన్నారు. పనిభారాన్ని తగ్గించి, ప్రభుత్వ సెలవులతో పాటు సంక్షేమ పథకాలు వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న ఆశాల సేవలను గుర్తించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పట్టణ కమిటీని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా సౌభాగ్య, కోశాధికారిగా రమాదేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ సీపీఎం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు


తాడిమర్రిలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సహకార్య నిర్వాహక్ శరత్‌బాబు

తాడిమర్రి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ శతాబ్ది ఉత్సవాలను తాడిమర్రిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ దేవర రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యనిర్వాహక్ శరత్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ కేవలం ఒక సంస్థ కాదని, ప్రజల్లో దేశభక్తి, సేవా స్ఫూర్తిని పెంపొందించిన ఉద్యమమన్నారు. దేశ నిర్మాణంలో యువత చురుకుగా పాల్గొనడానికి ఆర్ఎస్ఎస్ వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు అనుగుర్తి రమణ, ఆర్వేటి గంగాధర్, రమేశ్, వన్నూర్‌రెడ్డి, వెంకటనాయుడు, రామాంజనేయులు, మనోజ్ పాల్గొన్నారు.

● గాండ్లపెంట: ఎల్లవేళల దేశ భక్తి కలిగి దేశ సేవలో ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యులు రవికుమార్, పద్మభూషన్ నటరాజశెట్టి, కేశవరెడ్డి, బీఎల్ నరసింహరావు, వెంకటరమణ, గంగయ్య యాదవ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని పోతుకుంట గ్రామం ప్రియదర్శిని స్కూల్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఫారెస్ట్ అఫీసర్ అంజినప్ప, ప్రధానవక్తగా పులిచెర్ల వేణుగోపాల్ హాజరయ్యారు. పౌరులలో దేశభక్తిని పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ ఉద్దేశ్యమన్నారు. జిల్లా సహకార్య నిర్వాహక్ శరత్‌బాబు, సభ్యులు కృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 79 మంది ఎంపిక

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 79మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. అనంతరం రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్న డిజైనర్ నాగరాజును సత్కరించారు. రోటరీ క్లబ్ కోశాధికారి నరేంద్ర రెడ్డి, సభ్యులు శివయ్య, సుదర్శన గుప్త, రమేశ్‌బాబు, మనోహర్ గుప్త, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'కరాటేతో ఆత్మస్థైర్యం'


బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ సుమలత పేర్కొన్నారు. పట్టణంలోని జీవీఈ జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టెస్టులో 80 మంది దాకా పాల్గొనగా, ఇందులో 50 మంది విద్యార్థులు తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వారికి బెల్టులు, ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథులుగా హాజరైన పోలీసు అకాడమి కోచ్ మురళీ కృష్ణరెడ్డి, కదిరి సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్‌అలి, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ సుమలత, పాఠశాల పీఈటీలు స్వరూప, సరళ అందజేశారు. కరాటే మాస్టర్లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ, ఉదయ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కదిరి అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో అండర్ 19 జట్టు నిర్దీత 30 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సీనియర్ జట్టులో సంతోష్ 45, ప్రణయ్ 30 పరుగులతో రాణించారు. ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో పేరెంట్స్ టీం 16 ఓవర్లలో 130 పరుగులు చేసింది వీరిలో గణేష్ 26, నాగరాజు 20 పరుగులు చేశారు. లక్ష్య సాధనలో కోచింగ్ క్యాంప్ జూనియర్ జట్టు విజయం సాధించింది.

మొక్కజొన్న పంటకు గాలివాన దెబ్బ


చంద్రశేఖర్ పొలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

నల్లమాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో చంద్రశేఖర్ అనే రైతు తన ఎకరం పొలంలో మొక్కజొన్న పంట సాగుచేశాడు. అయితే రెండు రోజుల క్రితం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి వచ్చే సమయంలో పంట నెలకొరిగి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వారం పది రోజులలో కోత కోయాల్సి ఉందని, పంట పూర్తిగా నేలకొరగడంతో పెట్టిన పెట్టుబడి చేతికి రాదన్నాడు. సంబంధిత శాఖ అధికారులు పంటను పరిశీలించి, ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించాలని ఆయన కోరాడు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి: ఆర్డీఓ

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆర్డీఓ మహేశ్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆయన ఆదివారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలతో పాటు పరిశుభ్రత, మందుల నిల్వ, సిబ్బంది హాజరు వంటి అంశాలపై ఆరాతీశారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. రోగులపట్ల సిబ్బంది పూర్తి శ్రద్ధ వహించాలని, బాధ్యతతో వ్యహరించాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్టపర్తి రహదారిలో వేణుమోటార్స్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సోమందేపల్లి మండలం మేకలపల్లికి చెందిన రామాంజినప్ప, రవి ఆదివారం ద్విచక్రవాహనంలో ధర్మవరానికి పని నిమిత్తం వచ్చి తిరిగి సోమందేపల్లికి వెళ్తున్నారు. వేణుమోటార్స్ వద్దకు రాగానే పక్క వీధిలో నుంచి మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రామాంజినప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి గాయపడిన రామాంజినప్పను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


గౌతమి (ఫైల్)

అమడగూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం గౌతమి (23) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇడగొట్టు శ్రీనాథ్ భార్య గౌతమి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. ఆమె చిన్నాన్న స్థానికులకు విషయం తెలియజేయడంతో వెంటనే కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలికి ఏడాది, మూడేళ్ల పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండల్లో కోడిపందేలు

● పోలీసుల దాడి..

● ఒకరి అరెస్టు.. 11 బైక్‌ల స్వాధీనం

ధర్మవరంరూరల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ సమీపాన గల కొండల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కొంతమంది పారిపోగా ముదిగుబ్బ మండలం బ్రహ్మదేవరపల్లికి చెందిన గంగప్పను అరెస్టుచేసి, అతడి నుంచి రూ.250తోపాటు అక్కడేఉన్న 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అపూర్వ కలయిక


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెనుకొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ 2017-20 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కళాశాలకు చేరుకుని నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ కేశవయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు అరుణ, జంషీర్, నాగరాజుతోపాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డిలను సత్కరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

మడకశిర రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీ కోడిగేపల్లి గ్రామంలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులతో వాల్మీకి విగ్రహం వరకు ఊగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచు చంద్రప్ప, డీలర్ నరసింహప్ప పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గోరంట్ల, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు గాయపడ్డారు. గోరంట్ల మండలంలోని బెంగళూరు జాతీయ రహదారిపై తమ్మినాయన పల్లి సమీపంలో ఆదివారం ఉదయం ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి టాటా మ్యాజిక్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో డోన్ గ్రామానికి చెందిన టాటామ్యాజిక్ డ్రైవర్ రాజు గాయపడ్డాడు. అదేవిధంగా పుట్టపర్తి రహదారిలో గోరంట్లలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న రూపేష్ స్వగ్రామమైన పెడబల్లి తండాకు ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి వెళ్తుండగా కరావులపల్లి సమీపంలో అదుపుతప్పి పడ్డాడటంతో గాయాలయ్యాయి. వీరిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన యువకుడు రాహుల్ ఆదివారం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. కుటుంబలో నెలకొన్న కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నాని పాల్పడి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్ కుమార్ చికిత్స జరిపారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించినట్లు వైద్యుడు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గోరంట్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయలపల్లి శివారు ప్రాంతంలో 12 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.61,930 నగదును ఆదివారం స్వాధీనపరచుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సీఐ పోలీసు సిబ్బందితో వెళ్లి ఆరుబయట పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి పట్టుకున్నారు. 12 మంది జూదరులతో పాటు వారికి సంబంధించిన ఏడు ద్విచక్ర వాహనాలను, నగదును స్వాధీనపరచుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి కుంటను తలపిస్తున్న రహదారి


నీటికుంటను తలపిస్తున్న రహదారి

పరిగి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కొడికొండ సిర హైవే నుంచి నేతులపల్లి మీదుగా సంగమేశ్వర ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి కొద్దిపాటి వర్షానికే నీటికుంటను తలపిస్తోంది. రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లడానికి దారిలేక రోడ్డుపై నిల్వ ఉంటోంది. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆ ప్రాంతవాసులు అంటున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పటికి కార్మికులతో నీటిని తొలగిస్తారని, శాశ్వత పరిష్కారం మాత్రం చూపడంలేదని వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్‌ను వివరణ కోరగా పంచాయతీలో నిధుల కొరత ఉందని మురుగు కాలువలు నిర్మించేందుకు వీలుకావడం లేదన్నారు.

కొండల్లో కోడిపందేలు

● పోలీసుల దాడి.. ● ఒకరి అరెస్టు.. 11 బైక్‌ల స్వాధీనం

ధర్మవరంరూరల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ సమీపాన గల కొండల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కొంతమంది పారిపోగా ముదిగుబ్బ మండలం బ్రహ్మదేవరపల్లికి చెందిన గంగప్పను అరెస్టుచేసి, అతడి నుంచి రూ.250తోపాటు అక్కడేఉన్న 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కంటైనర్ బోల్తా

హిందూపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలంలోని వెంకటాపురం జాతీయరహదారిలో ఆదివారం భారీ కంటైనర్ బోల్తాపడింది. బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కంటైనర్ అదుపు తప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే వాహనంలో ఉన్నవారు సురక్షితంగా ఉండటంతో ఊపిరిపీల్చుకున్నారు.


బోల్తాపడిన కంటైనర్

నివేదికను తొక్కిపెట్టారా..?

బహిర్గతంకాని ఐసీడీఎస్ అధికారుల నివేదిక
వైసీపీ పెద్దల హస్తం ఉన్నట్లు గుర్తింపు
మరోమారు నోటీసులు జారీ


సీడీపీఓ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ (ఫైల్)

మడకశిరటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులకు సంబంధించి మరోమారు విచారణకు రావాలని నోటీసులు జారీ చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2020లో కోడిగుడ్ల, ఇతర వస్తువుల సరఫరాలో అవకతవకలు జరిగాయని అప్పట్లో విధులు నిర్వహిస్తున్న సీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్లు లీల, పద్మావతి, అరుణమ్మ, సన్నక్కపై ఆరోపణలు వచ్చాయి. దీంతో మడకశిర సీడీపీఓ కార్యాలయంపై 2021 సెప్టెంబరు 7న ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. అప్పటి ఏసీబీ డీఎస్పీ కులశేఖర్, ఎస్ఐ మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడు బృందాలుగా ఏర్పడి మూడు బ్లాక్‌లుగా ఏర్పాటు చేసుకొని దాడులు నిర్వహించారు. సీడీపీఓ కార్యాలయం, క్లస్టర్ లెవెల్ సూపర్‌వైజర్, గ్రామీణ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఏడు బృందాల్లో రెండు బృందాలు సీడీపీఓ కార్యాలయం, నాలుగు బృందాలు గ్రామస్థాయిలో, ఒక బృందం క్లస్టర్ లెవెల్‌లో తనిఖీలు నిర్వహించాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధిదారులకు అందిస్తున్న బాలామృతం, కోడిగుడ్లు, కిట్లు తదితర వాటిని సక్రమంగా అందిస్తున్నారా..? వాటిలో లోపాలు ఉన్నాయా..? నాణ్యతను పాటిస్తున్నారా.. ? అవకతవకలు జరుగుతున్నాయా..? అన్న కోణంలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ విచారణ చేశారు. పట్టణంలోని 24 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలను విచారించారు. మడకశిర, వడ్రపాళ్యం, కదిరేపల్లి, చీపులేటి, మెళవాయితోపాటు మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు నేరుగా వెళ్లి రికార్డులను పరిశీలించారు. బాలింతలు, పిల్లల తల్లిదండ్రులను పిలిపించి కోడిగుడ్లు, బాలామృతం, పాలు, బియ్యం అందుతున్నాయా..? తదితర వివరాలను సేకరించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న పాలప్యాకెట్లు, కోడిగుడ్లు, ఆహార పదార్థాల్లో నాణ్యతను పరిశీలించారు. 2021 సెప్టెంబరులో విచారణ పూర్తి చేశారు. అనంతరం ఏడు బృందాలు నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. అయితే వైసీపీ పెద్దల సహకారంతో వ్యవహారం పూర్తికాలేదని, దీంతో మారో మారు ఉన్నతధికారులు అప్పట్లో విధుల్లో ఉన్న సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ప్రస్తుతం నోటీసులు జారీ చేశారన్న చర్చ సాగుతోంది. అయితే జిల్లా స్థాయి అధికారులు మాత్రం తమకు పూర్తిస్థాయిలో సమాచారం లేదని, రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి నోటీసులు జారీ అయ్యాయని చెబుతున్నారు. అవినీతి ఆరోపణలు రావడంతో అప్పట్లో విచారణ జరిగి ఎలాంటి పురోగతి లేకపోవడంతోనే తిరిగి విచారణ చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నియోజకవర్గాన్ని గాలికొదిలేశారు

వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే బాలకృష్ణ ధ్వజం
పలుశాఖల అధికారులతో సమీక్ష


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

హిందూపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గాన్ని గాలికొదిలేశారని కనీసం ఒక్క అభివృద్ధి పనైనా గుర్తుండేలా చేయలేదని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. ఆదివారం హిందూపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండో రోజు చిలమత్తూరు మండలం తుమ్మలకుంటలో రేషన్ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పట్టణ చర్చించారు. వాణిజ్యపన్నుల శాఖ, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేడాదిలోపు పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత అధికారులదేనని కావాల్సిన నిధులు తీసుకొస్తానన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు సెంట్రల్ లైటింగ్ సిస్టంపై పనులు వేగవంతం చేయాలన్నారు. ఈనెలలోపే 92.5కోట్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. అందుకు తగ్గట్టు అధికారులు సహకారం అందించి హిందూపురాన్ని రాష్ట్రంలో నెంబర్1గా నిలిపేలా పనిచేయాలన్నారు. అనంతరం 69మందికి రూ.45లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు.

ఎవ్వరినీ ఉపేక్షించవద్దు: ఎమ్మెల్యే

నియోజకవర్గంలో కల్తీ మద్యం, కల్తీకల్లు విక్రయిస్తే ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించారు. ఆదివారం ఎమ్మెల్యేను సీఐ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో కల్తీమద్యం ఉందని తెలిస్తే ఎవరైనా సరే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటే సహించనన్నారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ

తన కార్యాలయంలో పలువురి నుంచి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మున్సిపల్ మెప్మాకు స్వచ్ఛ అవార్డు రావడంతో అధికారి గంగులయ్య, పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మీని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ బేవహనహళ్లి ఆనంద్, పరిమళ, చంద్రమోహన్, నాయకులు నాగరాజు, అనీల్, కౌన్సిలర్లు పవన్, భార్గవ్, అమీన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలకృష్ణ పర్యటన వివరాలు

నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఉదయం కె. బసవనపల్లి, పాఠశాల గదులను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బసవనపల్లి, లయోలా పాఠశాల మధ్య రూ.1.5కోట్లతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం హిందూపురం పట్టణం చిన్నమార్కెట్ నుంచి అంబేదర్ సర్కిల్‌వరకు జరిగే జీఎస్‌టీ ర్యాలీలో పాల్గొంటారు.

కొల్హాపురమ్మకు ప్రత్యేక పూజలు



రొళ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి అమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నలుమూలల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాదం వినియోగం అనంతరం అన్నదాన చేశారు.

చేసిన సేవే మిగిలేది

పాంచజన్య శ్రీనివాసులు


చీరలు పంపిణీ చేస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

హిందూపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మనమెంత సంపాదించినా ఆఖరికి మిగిలేది మనం చేసిన సేవేనని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వెయ్యి మంది వృద్ధులకు చీరలు, ధోతి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ పాల్గొని మాట్లాడారు. ప్రతియేడాది వెయ్యిమంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలను కూడా సేవాదృక్పథంతో నిర్వహిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వేలాది మందికి పలురకాల సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, జేవీకే రాము, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సందీప్, భారతి, స్మిత, నందిత, కరస్పాండెంట్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ డే

హిందూపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఆదివారం ప్రపంచ పాస్టర్స్‌డే నిర్వహించారు. పట్టణంలోని సీఅండ్ఐజి మిషన్‌చర్చ్, కాంపౌండ్‌లో పాస్టర్లను సత్కరించారు. అనంతరం కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాగేంద్రకుమార్, పాస్టర్లు స్టీఫెన్ రాజు, దేవరాజ్, ఆనంద్‌రాజ్, ప్రకాశ్, సల్మాన్‌రాజ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

శరవేగంగా కాలువ పనులు

అమరాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టనడుగు గ్రామ పొలిమేరలో హంద్రీనీవా కాలువలో పెరిగిన కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హంద్రీనీవా కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మండల కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. అమరాపురం చెరువును కృష్ణాజలాలతో నింపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా జలహారతి ఇచ్చేందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. చెరువులు నిండితే ఈ ప్రాంతంలో సాగు, తాగునీటికి కొదవ ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు.

'అన్యాయం చేస్తే ఊరుకోం'

సోమందేపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వివాహిత మౌనికను అన్యాయం చేస్తే ఊరుకోమని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆదివారం మౌనిక భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పెద్దన్న, రవి, అలివేలమ్మ, హనుమక్క, కొండ వెంకటేశులు పందిపర్తి గ్రామానికి వెళ్లి వివాహితకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో వారు మాట్లాడారు. వివాహితకు అన్యాయం చేస్తే ఊరుకోమన్నారు.

PUBLIC NOTICE

The General Public is herby informed that my client has entered into Agreement of Sale, dated 10-10-2025, with the land owner **Sri.HUNNUR ADAM BAIG S/o HUNNUR BAIG,** aged 79 years., Occ: Farmer residing in H.No.5-31, Rallapalli Village, Gundibandal Mandal, Anantapur District, Andhra Pradesh - 515305, for purchase of the property mentioned herein:

The Agricultural Land, to an extent of Ac 0-71 Cents., in Survey No.213-2, (Sub-Division No.213-2A-3) Situated at Rallapalli Village, Gudibanda Mandal, Ananthapur District, Andhra Pradesh, the owner being pattedar, assigned with Khata No.222, Passbook No.191898, granted by the Tahsildar, Gudibanda Mandal, Ananthapur District, having bounded by; **North:** Land of Sri.Chikamallapa. **South:** Land of Sri.ANANT NARAYANA, **East:** Main Road, **West:** Land of Sri.MUJEEB BHEJ. If any person/Bank/Financial Institution have any sort of claim, right, title or interest or any objections for the sale transaction, they should contact the under signed with their objections within 7 (Seven) days from the date of this publication. If no objection/s are received within the said specified period, my client will proceed with the said transaction treating the said property is free from all encumbrances and cliams.

SRIDHAR NAIDU KAVETI,
Advocate, B.COM., LLB
#29-391/251, Vajpayee Nagar,
Neredmet, Sec'bad-500056
Cell No: 9849079683

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.